
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు

5

గురువారం 1 ఆగస్టు 2024



మోడువారిన చెట్టుకు..
పిచ్చుక గూళ్లే ఆకులై..

మోడివారిన ఆ చెట్టుకు పిచ్చుకగూళ్లే ఆకులయ్యాయి. కొమ్మకొమ్మకో గిజిగాడి గూడుతో చెట్టు ఆకులను తలపిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా కంది మండలం కాశీపూర్ చెరువు వద్ద ఈ దృశ్యం కనిపించింది. మోడివారిన చెట్టుకు గూళ్లు అల్లుకుంటున్న గిజిగాళ్లను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించింది.

-ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి








సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సీజనల్ వ్యాధులు నమోదైతే
అధికారులదే బాధ్యత

- మున్సిపల్ కమిషనర్లు రోజూ ఉదయం వార్డుల్లో పర్యటించాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి హెచ్చరిక

సంగారెడ్డి అర్బన్, జూలై 31 : సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో సీజనల్ వ్యాధుల నివారణపై వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ, మండల స్పెషల్ ఆఫీసర్లతో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై పత్రికల్లో వస్తున్న కథనాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఆమె అధికారులను ప్రశ్నించారు. జహీరాబాద్, పటాన్‌చెరు, సదాశివపేట, అందోల్, అమీన్‌పూర్ మున్సిపాలిటీల్లో టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదాశివపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలోనే 845 టైఫాయిడ్ కేసులు నమోదు కావడంపై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డా.సత్యనారాయణపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెండ్ చేయమంటారా? అని సీరియస్ అయ్యారు. సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులు నమోదైతే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇక మున్సిపల్ కమిషనర్లు నిత్యం ఉదయం కాలనీలు, వార్డుల్లో పర్యటించాలని నిర్దేశించారు. అంతకుముందు పటాన్‌చెరు మండలంలో ఆగస్టు 10-24 వరకు నిర్వహించే ఎండీఏ కార్యక్రమంపై వివిధ శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రీదేవీ, జడ్పీ సీఈవో జానికీరామ్, డీపీవో సాయిబాబా, డీసీహెచ్‌ఎస్ డా.సంగారెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్, ఏరియా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం ఆమె పోలీస్, అబ్కారీశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ పఖ్వారా' కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగామన కల్పించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే 8712656777 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ రూపేష్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారటీ సెక్రటరీ రమేశ్, అడిషనల్ కలెక్టర్ మాధురి, ఎక్సైజ్ కమిషనర్ నవీన్‌చంద్ర పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- పోతిరెడ్డిపల్లిలో పర్యటన



పోతిరెడ్డి పల్లిలో ఓ ఇంట్లో పరిశుభ్రతను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం, జూలై 31 : సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. వీధివీధిలో తిరిగి పారిశుద్య నిర్వహణను పరిశీలించారు. దోమల వ్యాప్తి అరికట్టాలంటే ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కిరోసిన్, క్రూడ్‌ఆయిల్‌ను పిచికారీ చేయాలని సూచించారు. పరిసరాల్లో చెత్త నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, తాజా ఆహారాన్నే స్వీకరించాలని సూచించారు. నీటి వనరులను వారానికోసారి శుభ్రం చేసుకోవాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని నిర్దేశించారు. వర్షాకాలం నేపథ్యంలో పాడుబడిన బావులను, కూలిపోయే ఇళ్లను తొలగించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ గ్రామంలోని వన నర్సరీని పరిశీలించారు. ఆయనవెంట ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణవేణి, ఏఈవో శ్వేతాకుమారి, ఏఈవో వినీతభవాని, పంచాయతీ కార్యదర్శులు భూమేష్, అంజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ యాదులు, మాజీ ఎంపీటీసీ రూప్లా నాయక్ తదితరులు ఉన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

మెదక్ కల్చరల్ : మెదక్ మండలంలోని ర్యాలమడుగు గ్రామంలో రైతులతో కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత ఉన్న రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని భరోసా ఇచ్చారు. సాంకేతిక కారణాలు, ఇతర కారణాలతో రుణమాఫీ జరగనివారు స్థానిక అధికారులను కలసి ఫిర్యాదు చేయాలని సూచించారు. లేదా, కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు . ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ పథకం రెండు విడతల్లో జిల్లాలో వేల సంఖ్యలో రైతుల రుణాలు మాఫీ అయ్యాయని చెప్పారు. దీనిపై రైతులు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. వీధుల్లో తిరుగుతై పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, గ్రామస్థులు, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంఈవోలు కావలెను..!

- సంగారెడ్డి జిల్లాలో 28 మండలాలకు ఇన్‌చార్జిలే దిక్కు
- గెజిటెడ్ హెచ్‌ఎంలకు అదనపు బాధ్యతలు
- 12 మందికి 28 మండలాల విధులు
- పనిభారంతో గాడితప్పుతున్న పాఠశాల విద్య



సంగారెడ్డిలోని ఎంఈవో కార్యాలయం

సంగారెడ్డి అర్బన్, జూలై 31 : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా విద్యనందిస్తున్నామని చెబుతూ ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ విద్యార్థులను చేర్పిస్తున్నారు. కానీ పర్యవేక్షించే అధికారుల నియామకాలు లేక పాఠశాల విద్యావ్యవస్థ గాడి తప్పుతున్నది. సంగారెడ్డి జిల్లాలో ఒక్కరంటే ఒక్కరు రెగ్యులర్ ఎంఈవో లేకపోవడమే పరిస్థితికి నిదర్శనం. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకే ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఒక్కొక్కరికి 2 నుంచి 4 మండలాల బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలతో ప్రధానోపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారింది. ఫలితంగా పాఠశాలలపై పర్యవేక్షణ, విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలు ప్రశ్నార్థకంగా మారింది.

ఒక్కొక్కరికి 2-4 మండలాలు

సంగారెడ్డి జిల్లాలో 28 మండలాల ఎంఈవోలుగా 12 మందికి బాధ్యతలు అప్పగించారు. ఒక్కరు రెండు నుంచి నాలుగు మండలాల బాధ్యత చూస్తున్నారు. అమీన్‌పూర్, పటాన్‌చెరు మండలాలు ఒకరు, అందోల్, వట్‌పల్లి ఒకరు, కోహీర్, సదాశివపేట ఒకరు, నారాయణఖేడ్, నిజాంపేట ఒకరు, జహీరాబాద్, మొగుడంపల్లి ఒకరు బాధ్యతలు చూస్తున్నారు. ఇక కొండాపూర్, మునిపల్లి, న్యాల్‌కల్ మండలాలను ఒక్కో జీహెచ్‌ఎంకు అప్పగించారు. రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల మండలాలు ఒకరు, సంగారెడ్డి, కంది, హత్నూర మండలాలు ఒకరు చూస్తున్నారు. రాయికోడ్, ఝరాసంగం, మనూర్, నాగల్‌గిద్ద నాలుగు మండలాలు ఒకరు, కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి, పుల్‌కల్, చౌటకూర్ ఇలా నాలుగు మండలాలను ఒకరికే బాధ్యతలు అప్పగించారు.

పనిభారం..

పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచి పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా ఎంఈవోలు ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణ, మండల వనరుల కార్యాలయంలో ఉపాధ్యాయుల జీత భత్యాలు, రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం తీరు, రిజిస్టర్ల నిర్వహణ, చైల్డ్ ఇన్ఫ్, యూడైస్, మండల పరిషత్ సమావేశాలు, మండల అభివృద్ధి ప్రణాళికల్లో పాల్గొనడంతో పాటు జిల్లా స్థాయిలో జరిగే డీఈవో, కలెక్టర్ల సమీక్షా సమావేశాలకు హాజరుకావటం వంటి క్షణం తీరిక లేని పనులు వీరికి కత్తిమీద సాములా తయారయ్యాయి.

పడిపోతున్న విద్యా ప్రమాణాలు

పనిభారంతో ఇన్‌చార్జి ఎంఈవోలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒకవైపు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా.. మరోవైపు మండలాలకు ఎంఈవోలుగా వ్యవహరించడంతో విధులకు న్యాయం చేయలేకపోతున్నారు. అదనపు బాధ్యతలతో పాఠశాల సమస్యలు, పర్యవేక్షణ, విద్యప్రగతి అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలున్నాయి. ఇదే అదనుగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, సర్కారు పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, పాఠశాలల తనిఖీలు లేకుండా పోయాయి. విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలుపై నిర్లక్ష్యంతో విద్యాప్రమాణాలు పడిపోతున్న పరిస్థితి ఉన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్స్ నిబంధనలు పరిష్కారించి రెగ్యులర్ ఎంఈవోలను నియమించడం లేదా ఒక్కో మండలానికి ఒక్కరినే ఇన్‌చార్జి ఎంఈవోగా నియమించేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

అధికారుల తప్పిదం..
రైతులకు శాపం

ఒకే ఆధార్ నంబర్.. ఒకే ఖాతా నంబర్

తూప్రాన్ డివిజన్‌లో వందల మంది రుణమాఫీకి దూరం

తూప్రాన్, ఏప్రిల్ 31: అధికారుల తప్పిదంతో రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. వందల మంది పేరిట ఒకే ఖాతా నంబర్, ఒకే ఆధార్ నంబర్ నమోదు చేయడంతో బ్యాంకుల్లో రుణాలు మాఫీ కావడం లేదు. ఈ దుస్థితి తూప్రాన్ డివిజన్ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకా సంఘాల పరిధిలో నెలకొంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో రుణాలు పొందిన రైతుల వివరాలను నిర్ణీత నమూనాలో అందజేయలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే, సొసైటీలో పనిచేసే సిబ్బంది సమాచారం సేకరించకుండానే ఇష్టం వచ్చినట్టు వివరాలను నింపి ప్రభుత్వానికి పంపించారు. ఒకే ఆధార్ నంబర్ పలువురికి, ఒకే ఖాతా నంబర్‌ను మరికొంతమంది పేరిట నమోదు చేశారు. దీంతో ఆయా రైతులకు రుణమాఫీ నిధులు జమ కాలేదు.

1,101 మందితో అర్హుల జాబితా

తూప్రాన్ సొసైటీ పరిధిలో రైతు రుణమాఫీకి 1,101 మందిని అర్హులుగా పేర్కొంటూ అధికారులు జాబితాను సిద్ధం చేసి పంపించారు. ఆధార్ నంబర్లు లేని పలువురు రైతుల పేరిట ఒకే ఆధార్ నంబర్‌ను జత చేశారు. దీంతో రెండు విడుతల్లో జరిగిన రుణమాఫీలో అర్హుల జాబితాలని 25 శాతం మంది మాత్రమే లబ్ధి పొందారు. సొసైటీ నుంచి పంపిన జాబితాలో 247 మందిని మాత్రమే అర్హులుగా ప్రకటించి రుణమాఫీ డబ్బులు జమ చేశారు. రూ. 1.50 లక్షల లోపు రుణమాఫీ 968 మందికి జరగాల్సి ఉండగా.. 721 మంది రైతులకు రుణమాఫీ దక్కకుండా పోయింది. రుణమాఫీలో 613 ఖాతాలు ఎర్రర్‌గా చూపిస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే, డివిజన్ పరిధిలోని చేగుంట మండలం ఇబ్రహీంపూర్ సొసైటీలో మొదటి విడుత రూ. లక్ష రుణమాఫీకి 665 మందిని అర్హులుగా పేర్కొంటూ జాబితా పంపిస్తే.. 311 మందికి మాత్రమే రుణాలు మాఫీ అయ్యాయి. రూ. 1.50లక్షల లోపు రుణమాఫీ 98 మంది చేయాల్సి ఉందని జాబితా పంపితే అందులో 67 మందినే అర్హులు పేర్కొంటూ డబ్బులు జమ చేశారు. రెడ్డిపల్లి సొసైటీలో 515 మంది అర్హులని జాబితా పంపించారు. మొదటి విడత రూ. లక్ష లోపు రుణమాఫీలో 393 మందిని అర్హులుగా పంపిస్తే 188 మంది రైతులకు, రెండో విడుతలో రూ. లక్షన్నర లోపు మాఫీకి 122 మంది పేర్లు పంపితే.. 57 మంది మాత్రమే లబ్ధిపొందారు. వెల్దుర్తి సొసైటీ పరిధిలో 1,702 మందిని అర్హులుగా పంపగా, రెండు విడతల్లో 954 మంది మాత్రమే లబ్ధిపొందారు. అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదంతో రైతులు రుణమాఫీ పథకానికి దూరమయ్యారు.

రుణమాఫీ చేయండి



తూప్రాన్ సొసైటీ పరిధిలో రైతులకు రుణమాఫీ అమలు సక్రమంగా జరగలేదు. అధికారులు ఒకే ఖాతా నంబర్, ఒకే ఆధార్ నంబర్ ఇవ్వడంతో రైతులకు అన్యాయం జరిగింది. మొదటి విడత రుణమాఫీలోనే ఈ లోపాలను గుర్తించినా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

- మాచిరెడ్డి కిష్టారెడ్డి, రైతు

అధికారులకు నివేదిక పంపించాం



రైతుల ఆధార్ నంబర్ అందుబాటులో లేనివారికి ఇతరుల ఆధార్ వివరాలు నమోదు చేయడంతో సమస్య వచ్చింది. ఇదేవిధంగా పలువురి ఖాతా నంబర్ కూడా ఒకటే నమోదు చేశారు. దీంతో, ఆయా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలంటే బ్యాంకులో ఎర్రర్ చూపిస్తున్నది. ఇలాంటివారి వివరాలను సరిచేసి పంపించాం. వారందరికీ జరుగుతుంది.

- దినేష్, తూప్రాన్ సొసైటీ సీఈవో

కన్నతల్లిపై అఘాయిత్యం

మాసాయిపేట, జులై 31: సభ్యసమాజం తలదించుకునేలా ఓ కుమారుడు తల్లిపైనే అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మద్యం మత్తులో ఆమెపై అత్యాచారయత్నం చేశాడు. ఈ ఘటన మెదక్ జిల్లా మాసాయిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన నిందితుడి భార్యాపిల్లలు ఊరికి వెళ్లారు. ఈ నెల 29న మద్యం మత్తులో ఉన్న అతడు ఇంట్లో ఉన్న తల్లిపై అత్యాచారయత్నం చేయబోయాడు. ఆమె ప్రతిఘటించి అక్కడి నుంచి తప్పించుకుని బయటపడింది. అయితే, కన్న కొడుకే ఇలా చేయడంతో షాక్‌కు గురైన ఆమె బుధవారం బంధువుల సహాయంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి జరిగిన విషయాన్ని చెప్పింది. పోలీసులు వారి ఇంటిని పరిశీలించి, బాధితురాలిని చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ బాలరాజు తెలిపారు.

గోల్డ్ బిస్కెట్ పేరుతో మోసం

- మహిళకు రూ. 4 లక్షల టోకరా



నకిలీ బంగారు బిస్కెట్

పటాన్‌చెరు, జూలై 31: బిడ్డ పెళ్లికి అప్పు కావాలని బంగారు బిస్కెట్ కుదువ పెట్టుకుని అప్పుగా ఇవ్వాలని ఓ మహిళ నుంచి రూ. 4 లక్షలు తీసుకుని దంపతులు పరారైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్‌పూర్ ఎస్ఐ సోమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం కిష్టారెడ్డిపేటకు చెందిన గన్నవత్తుల రాజరాజేశ్వరి బీరంగూడ భ్రమరాంభికా కాలనీలో కిరాణ దుకాణం నడుపుతోంది. ఆమె వద్ద రమణమ్మ, ఆమె భర్త సామాన్లు కొనుగోలు చేసేవారు. ఈ క్రమంలో పరిచయం పెంచుకుని తమ కుమార్తె పెళ్లికి రూ. 8 లక్షలు అప్పుగా కావాలని రాజరాజేశ్వరిని కోరారు. ఇందుకోసం గోల్కొండ ప్రాంతలో కేబుల్ తవ్వకాల్లో తమకు దొరికిన పురాతన బంగారం బిస్కెట్‌ను కుదువ పెడతామని నమ్మించారు. రాజరాజేశ్వరి వారికి రూ. 4 లక్షలు ఇవ్వగా బంగారం బిస్కెట్‌ను ఇచ్చి ఉడాయించారు. ఐదు రోజుల తర్వాత రమణమ్మకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చి బంగారు బిస్కెట్‌ను పరీక్షించగా నకిలీదని తేలింది. ఈ నేపథ్యంలో బాధితురాలు బుధవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మీ ఇంట్లో ఇలాంటివే తింటారా?

- వసతి గృహంలో కుళ్లిన కూరగాయలు
- కంపు కొడుతున్న నీళ్ల ట్యాంకు
- రికార్డులోనే సగం మంది విద్యార్థులు
- విద్యార్థుల ఆరోగ్యంపై నీలినీడలు





హాస్టల్‌లో పాడైన కూరగాయలు

వట్‌పల్లి, జూలై 31 : వసతిగృహాల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నమని చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడంలేదన్న ఆరోపణలున్నాయి. వట్‌పల్లి మండలం దేవునూర్ బాలుర వసతి గృహంలోని పరిస్థితులే ఇందుకు నిదర్శనం. పురుగులు పట్టిన బియ్యం, కుళ్లిపోయిన కూరగాయలు వండి పెడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దేవునూర్ వసతి గృహంలోని విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాసిరకం ఉంటున్నదని ఫిర్యాదులు వస్తున్నాయి. వారం పది రోజులకోసారి కూరగాయలు కొనుగోలు చేయడంతో కుళ్లిపోగా వాటినే వండుతున్నారు. తాగు నీటి ట్యాంకులో చెత్తాచెదారం పేరుకుపోయింది. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో కంపుకొడుతున్నాయి. పరిస్థితి ఇలా ఉంటే విద్యార్థులు వ్యాధుల బారినపడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రికార్డుల్లోనే సగం మంది..

వసతిగృహంలో 73 మంది విద్యార్థులున్నట్లు రికార్డుల్లో ఉన్నప్పటికీ.. వాస్తవంగా 40 మంది కూడా ఉండడం లేదు. వార్డెన్ ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. వసతి గృహంలో పరిస్థితులపై జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



తాగునీటి ట్యాంకులో పేరుకున్న చెత్త





దేశ భవిష్యత్తు, అభివృద్ధి యువత చేతుల్లోనే

● సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి రూరల్, జూలై 31 : దేశ భవిష్యత్తు, అభివృద్ధి యువత చేతుల్లోనే ఉన్నదని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను బుధవారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యాలు అవసరమని అన్నారు. దేశం ఔన్నత్యాన్ని నిలబెట్టగల శక్తి సామర్థ్యాలు యువతరానికి సొంతమని, మార్పు రావాల్సింది కూడా యువతలోనే అన్నారు. కానీ దురదృష్టవశాత్తు నేటి యువత తమ కర్తవ్యాన్ని విస్మరించి మత్తులో తేలియాడి జ్ఞానాన్ని, విచక్షణను, శక్తిసామర్థ్యాలను కోల్పోయి, నిర్వీర్యమై, నిస్తేజంగా మారుతున్నారని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగంతో యువత పెడదారిన పడుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా జిల్లా కార్యదర్శి అనిల్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, డీవైఎఫ్ఐ నాయకులు బుచ్చయ్య సాయి తదితరులు పాల్గొన్నారు.

















సంగారెడ్డి కెనాల్ భూ బాధితులతో ఆర్డీవో చర్చలు

● రిలే దీక్షల విరమించాలని కోరిన అధికారి
● స్పష్టమైన హామీ ఇస్తే చేస్తామన్నరైతులు



ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

నర్సాపూర్, జూలై 31 : రిలే దీక్షలు చేస్తున్న సంగారెడ్డి కెనాల్ భూ బాధిత రైతులతో ఆర్డీవో చర్చలు జరిపారు. నర్సాపూర్ ప్రధానచౌరస్తా వద్ద కొనసాగుతున్న రిలే దీక్ష బుధవారంతో 20వ రోజుకు చేరుకున్నాయి. రైతుల వద్దకు ఎస్ఐ పుష్పరాజ్ వెళ్లి వారితో చర్చించి ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లారు. రైతులతో చర్చలు జరిపిన ఆర్డీవో దీక్ష విరమించాలని వారిని కోరారు. ఎంతో విలువైన భూమిని కోల్పోతున్న తమకు స్పష్టమైన హామీ ఇస్తే తప్పా విరమించబోమని చెప్పారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని లిఖితపూర్వకంగా సమస్యలు తెలపాలని ఆర్డీవో కోరారు. కెనాల్ కోసం భూములు తప్పనిపరిస్థితులో తీసుకోవాల్సి వస్తే పరిహారంతో పాటు ఇతర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని భూబాదతులు ఆర్డీవోకు అందచేశారు.

వాడీవేడిగా

సంగారెడ్డి, మెదక్ మున్సిపాలిటీల్లో సర్వసభ్య సమావేశాలు

సంగారెడ్డి, మెదక్ మున్సిపాలిటీలో బుధవారం పాలకవర్గ సమావేశాలను నిర్వహించారు. పారిశుధ్య లోపం, కుక్కల బెడద, తాగునీటి సరఫరా, అధ్వాన రోడ్లు, విద్యుత్ దీపాలు, తదితర సమస్యలపై వాడీవేడిగా చర్చ జరిగింది. సంగారెడ్డి మున్సిపాలిటీలో పార్లమెంట్ ఎన్నికల ఖర్చు పేరిట నిధుల స్వాహా చేశారని కౌన్సిలర్లు మండిపడ్డారు. మెదక్ బల్దియాలో మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణ సదుపాయాల్లో బినామీలపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు.



సంగారెడ్డి బల్దియా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సురేష్‌పవార్‌ను నిలదీస్తున్న కౌన్సిలర్ కొత్తపల్లి శ్రీకాంత్

సంగారెడ్డి టౌన్, జూలై 31 : సంగారెడ్డి బల్దియా కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి అధ్యక్షతన పాలకవర్గం సమావేశం కొనసాగింది. ట్రైనీ కలెక్టర్ మనోజ్ హాజరైన ఈ సమావేశంలో పలు సమస్యలపై కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులను నిలదీశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఖర్చు పేరుతో మున్సిపల్ నిధులు స్వాహా చేశారని అధికారులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కౌన్సిలర్ కూన వనిత మాట్లాడుతు ఇటీవలజరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సిబ్బందికి తాగునీరు, మజ్జీగ తదితరాలను సరఫరా చేసినట్లు రికార్డుల్లో రాసి మున్సిపల్ నుంచి లక్షలాది రూపాయలు ఖర్చుచేయడమేంటని అధికారులను ప్రశ్నించారు. గతేడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ సిబ్బందికి గౌరవభృతి అందజేసినట్లు అప్పటి కమిషనర్ లక్షలాదిరూపాయలు స్వాహా చేశారని ఆరోపించారు. ఎన్నికల ఖర్చుపై ఎలాంటి ఆడిట్ ఉండదనే ఉద్దేశంతో మున్సిపల్ అధికారులు నిధులను వాడుకోవడమేంటని ప్రశ్నించారు. మరో కౌన్సిలర్ కొత్తపల్లి శ్రీకాంత్ మాట్లాడుతు వైకుంఠ రథంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఫొటో ఉండడాన్ని జీర్ణించుకోలేక ఆ వాహనాన్ని మూలన పడేశారని విమర్శించారు. కౌన్సిలర్లు పొన్న రాజేందర్‌రెడ్డి, నాగరాజు, శ్రీకాంత్, నాయికోటి రామప్ప తదితరులు మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని, ఇంటింటి చెత్తసేకరణ సక్రమంగా నిర్వహించడం లేదని ధ్వజమెత్తారు. అనేక వార్డుల్లో వీధిదీపాలు వెలుగడంలేదన్నారు. వీధిక్కుల బెడదను అరికట్టడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. వీధి కుక్కల నివారణ పేరిట ప్రతియేట లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తున్నప్పటికి క్షేత్రస్థాయిలో కుక్కలను అరికట్టడం లేదని ఆరోపించారు. మున్సిపల్ డీఈఈ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం స్పెషల్‌డెవలప్‌మెంట్ కింద కేటాయించిన రూ.20కోట్ల పనులు రద్దయ్యాయని, వాటితో పాటు పట్టణాభివృద్ధికి మరో రూ.30కోట్లు అవసరమంటు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సురేష్‌పవార్, టీపీవో కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ దుకాణసముదాయాల్లో బినామీలు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 31: చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ అధ్యక్షతన బుధవారం మెదక్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాల్లో ఉన్న బినామీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చైర్మన్ చంద్రపాల్ మాట్లాడుతూ గతంలోనే అవకాశం ఇచ్చామని, ఇప్పటికే 30 ఏళ్ల లీజు కొనసాగినందున వీలుకాదని తెలిపారు. అలా అయినప్పుడు బినామీలను గుర్తించి నిజమైన వ్యాపారులకు అవకాశమివ్వాలని సభ్యులు కోరారు. అంతేగాకుండా మార్కెట్ ధరలకనుగుణంగా అద్దెలను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల ముందు చిరువ్యాపారులు తోపుడుబండ్లు పెట్టుకుంటే వారి వద్ద దుకాణాదారులు అధికంగా అద్దె వసూలు చేస్తున్నారని చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై ఆలోచించాలని కమిషనర్ జానకీరాంసాగర్‌ను చైర్మన్ ఆదేశించారు. మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులు ప్రమాదాలకు లోనై ప్రాణాలు కోల్పోతున్నారని, సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా ఇన్సురెన్స్ చేయించేలా చూడాలని కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు కోరారు. ఔరంగాబాద్ శివారులో చికెన్, కొబ్బరిబొండాల చెత్తాచెదారాలను పారబోస్తున్నారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ భీమరి కిషోర్ కోరారు. మున్సిపాలిటీలో విలీనమైన తన వార్డు రెవెన్యూ భూ హద్దులు నిర్ణయించాలన్నారు. కౌన్సిలర్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మేఘమాల మాట్లాడుతూ కుక్కలు, కోతల బెడద తీర్చాలన్నారు. తాగునీటిలో చెత్తాచెదారాలు వస్తున్నాయని మండిపడ్డారు. ప్రతీ కౌన్సిల్ సమావేశంలో సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని కో-ఆప్షన్ సభ్యుడు గంగాధర్ ఆగ్రహంవ్యక్తం చేశారు. చైర్మన్ చంద్రపాల్ బదులిస్తూ చెత్తాచెదారాలు వేసే వారిపై జరిమానాలు విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. కుక్కలను త్వరలోనే పట్టిస్తామని, ఎనిమల్ కేర్ సెంటర్‌ను కూడా మరో 20 రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కమిషనర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మెదక్ కమిషనర్‌తో మాట్లాడుతున్న చైర్మన్ చంద్రపాల్

నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు

● తల్లి పాల ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమాలు
● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, జూలై 31 : తల్లిపాల వారోత్సవాలను నేటి నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించనున్నట్లు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో సీడీపీవో, వైద్య శాఖ అధికారులతో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల నిర్వహణ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ అంగన్‌వాడీ సెంటర్ల పరిధి, సబ్ సెంటర్లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ కార్యాలయం, డీఆర్డీఏ, మెప్మా, ఆరోగ్య శాఖ సిబ్బంది, పత్రిక, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో వంద శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరిగేలా చూడాలన్నారు. ముర్రుపాలు పట్టించే విధానం 58శాతం మాత్రమే ఉందన్నారు. తల్లిపాలు, ముర్రుపాల ప్రాముఖ్యంపై ఈ ఏడాది ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇచ్చిన ప్రణాళిక ప్రకారం సామాజిక వేడుకలు, ఆస్పత్రుల సందర్శన, గృహ సందర్శనలు, ఎస్‌హెచ్‌జీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. దీనిలో భాగంగా ఏడు నెలల నుంచి రెండు సంవత్సరాల పిల్లలకి బాలామృతం, బాలామృతం ప్లస్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా శిశు సంక్షేమాధికారి లలితకుమారి, డీఈవో వెంకటేశ్వర్లు, డీపీవో సాయిబాబా, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, సీడీపీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు

మెదక్ కల్చరల్, జూలై 31 : నేటి నుంచి తల్లి పాల వారోత్సవాన్ని నిర్వహించనున్నామని, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామని మెదక్ జిల్లా ఐసీడీఎస్ పీడీ బ్రహ్మాజీ తెలిపారు. 'అంతరాలను తొలగించి తల్లిపాల ప్రాముఖ్యాన్ని చాటుదాం' అనే థీమ్‌తో ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. పుట్టిన ప్రతీ శిశువు ఆయురారోగ్యాలతో ఉండేందుకు మాతృ పాలు దోహదం చేస్తాయని తెలిపారు. పుట్టిన వెంటనే పాపకు ముర్రుపాలను అందించడం, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించేలా చూడడం, రెండు సంవత్సరాల వరకు కొనసాగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.



ఐసీడీఎస్ పీడీ బ్రహ్మాజీ

నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో వాహనాల తనిఖీలు



కందిలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న వాహనాలు

● సరైన పత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలు సీజ్

కంది, జూలై 31 : మాదకద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడానికి సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశాల మేరకు బుధవారం కందిలోని 65వ నంబరు జాతీయరహదారిపై తనిఖీలు నిర్వహించారు. మెగా వెహికిల్ చెకింగ్ పేరుతో నార్కోటిక్ బృందంతో కలిసి డాగ్‌స్క్వాడ్‌తో సంగారెడ్డి పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సాయంత్రం ఐదు గంటలకు దాదాపు 30 మంది పోలీసు జాగిలంతో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో భాగంగా సరైన పత్రాలు, సరైన నంబర్‌ప్లేట్లు, లేని 42 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్‌ను చేశారు. ఈ తనిఖీల్లో సంగారెడ్డి రూరల్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ వినయ్‌కుమార్, ఇంద్రకరణ్ ఎస్ విజయ్ కుమార్ ఏఎస్ఐలు, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం మీట్‌కు 732 మంది టీచర్లు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 31 : పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించనున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో పదోన్నతి పొందిన టీచర్లతో సీఎం మాట్లాడనున్నారన్నారు. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేసే మీటింగ్‌కు జిల్లాలో ప్రమోషన్లు పొందిన అన్ని పాఠశాలల ఉపాధ్యాయులను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 732 మందికి ప్రమోషన్‌లు వచ్చాయని, వారందరికీ సమాచారం అందించాలన్నారు. ఏర్పాటు చేసిన రూట్ బస్సు పాయింట్ల వద్ద ఉదయం 8:30 గంటల వరకు టీచర్లు చేరుకోవాలన్నారు. తరలివెళ్లే ఉపాధ్యాయులకు అన్నిఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, డీఈవో రాధాకిషన్, డీఎం సురేఖ, గురుకుల సొసైటీల అధికారులు పాల్గొన్నారు.

మెదక్ డీఎఫ్‌వోగా జోజీ

మెదక్ మున్సిపాలిటీ, జూలై 31 : మెదక్ జిల్లా అటవీ అధికారి(డీఎఫ్‌వో)గా ఎం.జోజీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. జోజీ హైదరాబాద్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ డీఎఫ్‌వోగా పనిచేసిన రవిప్రసాద్ జగిత్యాల డీఎఫ్‌వోగా బదిలీపై వెళ్లారు. కాగా జోజీ గతంలో మెదక్ వన్యప్రాణి అభయారణ్యం డీఎఫ్‌వోగా పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతల అనంతరం కింది స్థాయి అధికారులతో జోజీ సమావేశమయ్యారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

● చిన్నకిష్టాపూర్ ఎక్స్‌రోడ్‌లో డివైడర్‌ను ఢీకొని యువకుడు
● తిమ్మారెడ్డిపల్లి శివారులో లారీ సడెన్ బ్రేక్‌తో కారులోని వ్యక్తి
● ధర్మసాగర్ గేట్ వద్ద కారును బైక్ ఢీకొనగా మరొకరు
● పోతిన్‌శెట్టిపల్లిలో రెండు బైక్‌లు ఢీకొనడంతో మహిళ



డివైడర్‌పై దర్శన్ మృతదేహం

కుకునూరుపల్లి, జూలై 31 : ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడపడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనగా యువకుడు మృతిచెందిన ఘటన కుకునూరుపల్లి మండలంలోని చిన్నకిష్టాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద చోటుచేసుకున్నది. ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన దర్శన్(19) తన తండ్రి బైక్‌ను తీసుకొని సొంత పని నిమిత్తం మంగళవారం సాయంత్రం సిద్దిపేటకు వెళ్లి బుధవారం రాత్రి తిరుగుప్రయాణమయ్యాడు. అతివేగంతో బైక్‌ను నడుపుతుండగా అర్ధరాత్రి రెండు గంటల సమయంలో చిన్నకిష్టాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దర్శన్ కింద పడిపోవడంతో తలకు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీకి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు.

లారీని కారు ఢీకొనడంతో ఒకరు



కారులో చంద్రశేఖర్ మృతదేహం

కొండపాక, జూలై 31 : ముందు వెళ్తున్న లారీ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో వెనకాలే ఉన్న కారు లారీని బలంగా ఢీకొట్టగా ఒకరు మృతిచెందిన సంఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో బుధవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా కీసర నాగారం గ్రామానికి చెందిన గుడ్ల చంద్రశేఖర్(58) కరీంనగర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సొంత కారులో మంగళవారం కరీంనగర్ వెళ్లి తిరిగి బుధవారం ఉదయం హైదరాబాద్‌కు వెళుతుండగా తిమ్మారెడ్డిపల్లి శివారులో అతివేగంగా వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేసింది. వెనుకనే ఉన్న చంద్రశేఖర్ కారు కంట్రోల్ కాక లారీకి ఢీకొట్టుకుంది. దాంతో ఆయన ఛాతికు స్టీరింగ్ గుద్దడంతో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

రుణమాఫీ కోసం బ్యాంక్‌కు వెళ్లి వస్తూ మరొకరు



గోపిలాల్ మృతదేహం

కౌడిపల్లి, జూలై 31 : కారును బైక్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని ధర్మసాగర్ గేట్ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. మృతుడి కుటుంబీకుల తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం మండలంలోని ఏనిగండ్ల గ్రామ పంచాయతీలోని దుంపలకుంట తండా కు చెందిన కొర్ర గోపిలాల్(42) కొంతకాలంగా రంగారెడ్డి జిల్లా మేడ్చెల్‌లోని ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. గోపిలాల్ భార్య లలిత పేరిట రంగంపేటలోని ఎస్‌బీఐలో రూ.డెబ్బై వేల వ్యవసాయ రుణం ఉంది. మాఫీలో తన భార్య పేరు లేకపోవడంతో బ్యాంక్ వెళ్లి వివరాలు తెలుసుకున్నాడు. సాయంత్రం బైక్‌పై ఇంటికి బయలు దేరగా, మండల పరిధిలోని ధర్మసాగర్ గేట్ సమీపంలోనికి రాగానే ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ఏరియా అసుపత్రికి తరలించగా, అప్పటికే గోపిలాల్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొని మహిళ

మాసాయిపేట, జూలై 31 : ఎదురెదుగా వస్తోన్న రెండు బైక్‌లు ఢీకొనగా ఓ మహిళ మృతిచెందిన సంఘటన మాసాయిపేట మండల పరిధిలో బుధవారం చోటుచేసుకున్నది. చేగుంట ఎస్ఐ బాలరాజు వివరాల ప్రకారం.. శివంపేట మండలం పర్కిబండకు చెందిన గంటి శివలక్ష్మి(38) తన కుమారుడితో కలిసి బైక్‌పై చేగుంట మండలం చందాయిపేటకు వెళ్తున్నది. మార్గమధ్యంలో పోతిన్‌శెట్టిపల్లి వద్ద ఎదురుగా వస్తోన్న మరో బైక్‌ను ఢీకొనగా వెనుక కూర్చొన్న శివలక్ష్మి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ తెలిపారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కొత్త సబ్‌స్టేషన్లు

● పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా మౌలిక వసతులు
● ట్రాన్స్‌కో మేడ్చల్ జోన్ సీఈ కె.సాయిబాబ

పటాన్‌చెరు, జూలై 31: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో మెరుగైన విద్యుత్ సరఫరాకు చక్రపురికాలనీలో కొత్త సబ్‌స్టేషన్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని మేడ్చల్ జోన్ ట్రాన్స్‌కో ఆపరేషన్స్ సీఈ కె.సాయిబాబా తెలిపారు. బుధవారం అమీన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పీఎస్ఆర్ కాలనీ, సాయిఅంబికా కాలనీవాసులను నేరుగా కలుసుకుని విద్యుత్ సరఫరా ఎలా జరుగుతోందని ఆరా తీశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ పరిధిలో ట్రాన్స్‌కో రెవెన్యూ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చక్రపురికాలనీలో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆయన వెంట ట్రాన్స్‌కో సంగారెడ్డి సర్కిల్ ఎస్ఈ ఆపరేషన్ సి.మాధవరెడ్డి, పటాన్‌చెరు డివిజన్ ఆపరేషన్ డీఈ ఎల్.భాస్కర్‌రావు, ఏడీఈ ఎన్.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో మేడ్చల్ జోన్ సీఈ సాయిబాబా

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో నేటి నుంచి 30 పోలీసు చట్టం

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్, జూలై 31: ఆగస్టు 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు సంగారెడ్డి, మెదక్ జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్టు 1861 అమలులో ఉంటుందని ఆయ జిల్లాల ఎస్పీలు చెన్నూరి రూపేష్, ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించకూడదని సూచించారు. ఒకవేళ అనుమతి లేకుండా ఎవరైనా పై చర్యలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులతో సహకరించాలని ఎస్పీలు కోరారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన మెదక్ ఎస్పీ


సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చిన్నశంకరంపేట, చేగుంట, జూలై 31: చిన్న శంకరంపేట, చేగుంట మండల కేంద్రాల్లోని పోలీస్ స్టేషన్లను మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిసెప్షన్, లాకప్ టెక్నికల్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐ నారాయణగౌడ్, బాల్‌రాజుకు పలు సూచనలు చేశారు. బాధితుల ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు సత్వరమే స్పందించి సేవలందించాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రజలకు చైతన్య పరచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు.

పొంచి ఉన్న ప్రమాదం




పాఠశాల భవనం పైకప్పు నుంచి ఊరుస్తున్న వర్షం నీరు, భవనం పునాదుల కింద నుంచి కూలుతున్న దృశ్యం, పిల్లర్ పైనే ఆధారపడి ఉన్న భవనం మూల

- శిథిలావస్థలో ముస్లాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల
- కూలుతున్న పునాది రాళ్లు
- ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన కరువు
- ఆందోళనలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు

అల్లాదుర్గం, జూలై 31: ప్రభుత్వ పాఠశాలలకు మెరుగైన వసతులు కల్పిస్తూ, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం రూ. కోట్లాదిగా నిధులు వెచ్చిస్తున్నప్పటికీ కొందరి నిర్లక్ష్య ధోరణి ప్రభుత్వాశయాన్ని నీరుగారుస్తోంది. శిథిలావస్థలో పాఠశాలలపై దృష్టి సారించకుండా నామ మాత్రం పనులపై మాత్రమే ఆసక్తి చూపుతూ పని కానిచ్చేస్తుండటమే ఇందుకు కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనే ఇందుకు నిదర్శనమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

పునాదులు కూలుతున్నా స్పందించరా?

ముస్లాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల భవనం శిథిలమై పునాదుల రాళ్లు కూలుతుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో 8 నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతుండగా మొత్తం 231 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవల వర్షాల కారణంగా ఈ పాఠశాల భవనం పైకప్పు నుంచి ఊరుస్తూ ప్రమాదాన్ని తలపిస్తున్నది. ఈ విషయమై పాఠశాల ఉపాధ్యాయులు జిల్లా అధికారులకు విన్నవిస్తూ వినతిపత్రాన్ని అందజేసినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. అయినప్పటికీ ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల కేటాయింపులోనూ ఈ పాఠశాల భవనం మరమ్మతులకు నిధులు కేటాయించక పోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాల భవనానికి పొంచి ఉన్న ప్రమాదంపై జిల్లా అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



శిథిలమైన ఈ పాఠశాలపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా అధికారులకు విన్నవించాం. ఈ నెల 27న పాఠశాలను సందర్శించిన జడ్పీ సీఈవో ఎల్లయ్య సైతం స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా ఈ పాఠశాల భవనానికి మరమ్మతు పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తే సమస్య పరిష్కారమవుతుంది.

\- రమేష్, హెచ్ఎం, ముస్లాపూర్ జడ్పీ హెచ్ఎస్

జిల్లా ఎస్పీని కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు


సంగారెడ్డి ఎస్పీ రూపేష్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సత్యనారాయణ, నిర్మల తదితరులు

సంగారెడ్డి క్రైం, జూలై 31: సంగారెడ్డి జిల్లాలో 3వ ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మోకిల సత్యనారాయణ, అసిస్టెంట్ సెషన్స్ కోర్టు గ్రేడ్ 2 పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సి. నిర్మల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

గంజాయిపట్టివేత.. నిందితుడి అరెస్ట్

చేగుంట, జూలై 31: మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రంలోని బుధవారం వాహనంపై గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నార్సింగి ఎస్‌ఐ మోహియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. 44 నంబర్ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకోగా అతడి వద్ద 46 గ్రాముల గంజాయి లభ్యమైనట్టు తెలిపారు. నిందితుడు ఆదిలాబాద్ జిల్లా సుభాష్‌నగర్‌కు చెందిన తాపి మేస్త్రి అని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తహసీల్దార్ ఎదుట అనుమానిత వ్యక్తి బైండోవర్

జహీరాబాద్, జూలై 31: పట్టణంలోని బస్టాండ్‌లో మంగళవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న బీదర్‌కు చెందిన మేహరాజ్‌ను బుధవారం తహసీల్దార్ రవీందర్ ఎదుట బైండోవర్ చేసినట్టు పోలీసులు వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, పోలీసులు మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పదంగా వీధుల్లో, బస్టాండ్‌లలో, రైల్వేస్టేషన్‌లలో తిరిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హోంగార్డు జలీల్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో క్లూస్‌టీం విచారణ

నారాయణఖేడ్,జూలై 31: ఖేడ్ మండలం తుర్కపల్లిలో మంగళవారం పట్టపగలు గుర్తు తెలియని దొంగలు ఇంటితాళాన్ని పగుల గొట్టి ఇంట్లోని బంగారు, వెండి నగలు, నగదు అపహరించిన ఘటనలో బుధవారం క్లూస్ టీం సందర్శించి విచారణ నిర్వహించింది. ఇంటి తాళంతో పాటు బీరువా సైతం బద్దలు కొట్టి అందులో ఉన్న 5 తులాల బంగారు, 70 తులాల వెండి నగలతో పాటు రూ.32 వేల నగదు చోరీకి గురైన విషయం విదితమే. కాగా క్లూస్ టీం బీరువాపై వేలి ముద్రలను సేకరించారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి వివరాలు సేకరించారు.

డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడిపించాలి

- జహీరాబాద్ రవాణాశాఖ ప్రాంతీయ అధికారి వెంకటయ్య

జహీరాబాద్, జూలై 31: వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ రవాణాశాఖ ప్రాంతీయ అధికారి వెంకటయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రమాదరహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్ల నిర్లక్ష్యం ఫలితంగా ఎందరో ప్రాణాలను కోల్పోయి మృతుల కుటుంబాల పరిస్థితి అధోగతి పాలవుతుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బస్సులను జాగ్రత్తగా నడిపిన డ్రైవర్లకు, సిబ్బందికి ఘనంగా సన్మానించారు.

● నారాయణఖేడ్, జూలై 31: ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల లక్ష్యం కావాలని స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. ఖేడ్ ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో బస్సులను ప్రమాదాలు కాకుండా జాగ్రత్తగా నడిపిన ఉద్యోగులు, కార్మికులకు డీఎం అవార్డులు, జ్ఞాపికలను అందజేశారు. కాగా ఖేడ్ ఆర్టీసీ డిపోలో కండక్టర్ గా విధులునిర్వహించిన గోపాల్‌రెడ్డి, మెకానికల్ శ్రామిక్ భూమాగౌడ్ పదవి విరమణ పొందడంతో వారిని ఘనంగా సన్మానించారు.

దివ్యాంగ ఉపకరణాలకు 186 మంది అర్హులు

సంగారెడ్డి అర్బన్, జూలై 31: సంగారెడ్డిలోని సంజీవనగర్ భవిత కేంద్రంలో సమగ్రశిక్ష, అలింకో సంయుక్తంగా దివ్యాంగ ఉపకరణాల అర్హుల గుర్తింపు శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లాలోని సుమారు 250మందికి పైగా దివ్యాంగులు శిబిరానికి హాజరయ్యారు. వారి నుంచి 186 మంది అర్హులను గుర్తించారు. త్వరలో వారికి దివ్యాంగ సహాయ ఉపకరణాలను అందించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, జూలై 31 : వర్గల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 16 వ తేదీలోగా నవోదయ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు నవోదయ వెబ్‌సైట్ లేదా 9921555310, 9448901318 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్స్

మెదక్ అర్బన్, జూలై 31: మెదక్ పట్టణంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల బాలికల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎస్టీ కేటగిరీ ఖాళీల భర్తీ కోసం గురువారం స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వసుంధర తెలిపారు. ఎంపీసీలో 13, బైపీసీలో 3 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు.

● కంగ్టి, జూలై 31: కంగ్టిలోని గిరిజన బాలుర గురుకులంలో వివిధ తరగతులలో ఖాళీగా ఉన్నసీట్ల భర్తీకి ఆగస్టు 1న స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రాయ్‌బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 3 సీట్లు, 7లో ఒకటి, 8లో రెండు, 9వ తరగతిలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ఒరిజినల్‌పత్రాలతో హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

జిన్నారం, జూలై 31: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం ఆగస్టు 1న ఉమ్మడి జిన్నారం మండలంలోని పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈలు రవీందర్, రాజులు తెలిపారు. అన్నారం, గడ్డపోతారం, బొంతపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండన్నారు.

పారిశుధ్య పనులపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి


కొడిపల్లి: దేవులపల్లి పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న మెదక్ జిల్లా పంచాయతీ అధికారి


నారాయణఖేడ్‌లో పారిశుధ్య కార్మికులకు సూచనలిస్తున్న కమిషనర్

కొడిపల్లి, జూలై 31: గ్రామ పంచాయతీల పారిశుధ్య పనుల్లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని మెదక్ జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పేర్కొన్నారు. నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఇద్దరికి డెంగీ వచ్చిందనే సమాచారంతో బుధవారం ఉదయం మండల పరిధిలోని దేవులపల్లి గ్రామపంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ.. పంచాయతీలోని ప్రతీ కుటుంబం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచినట్లయితే ఎలాంటి వ్యాధులు దరిచేరవని తెలిపారు. డెంగీ సోకినవారు కోలుకున్నారని, ఎవరూ అధైర్యపడవద్దని తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా తిరిగి గ్రామస్థులతో మాట్లాడారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి గ్రామస్థులు ఉన్నారు.

● చిన్నశంకరంపేట: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు పరిశుభ్రతపై చైతన్యం చేయాలని చిన్నశంకరంపేట ఎంపీవో కలిమొళ్ల సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని పరిసరాలు, డ్రైనేజీలను శుభ్రం చేసి, హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. ఎవరికైనా జ్వరం లక్షణాలు కనిపిస్తే ప్రభుత్వ వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని ఆదేశించారు.

పారిశుధ్య పనులను తనిఖీ చేసిన కమిషనర్

నారాయణఖేడ్, జూలై 31: ఖేడ్ మున్సిపల్ పరిధిలో పారిశుధ్య పనులను బుధవారం తెల్లవారు జామున మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజీవ్ చౌక్‌వద్ద కార్మికుల హాజరును పరిశీలించారు. అనంతరం ప్రధాన చౌరస్తాల్లో కార్మికులు రోడ్లు శుభ్రం చేయడం, చెత్తను సేకరించడం, గృహాల నుంచి తడి,పొడి చెత్తను సేకరించడాన్ని కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన పరిశుభ్రత చర్యల గురించి శానిటేషన్ అధికారి శ్రీనివాస్‌కు తగిన సూచనలు ఇచ్చారు.


రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

ధరణి తీరును పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

కొండాపూర్, జూలై 31: కొండాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ మనోజ్ బుధవారం సందర్శించారు. శిక్షణలో భాగంగా ఆయన తహసీల్దార్ కార్యాలయంలో అనునిత్యం నిర్వహించే రికార్డులు, విధి విధానాలు, ప్రజలకు అందించే సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యలు, పెండింగ్ ఫైల్స్, భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల నమోదు తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిత, నయాబ్ తహసీల్దార్ ప్రదీప్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మహదేవ్, రాజు తదితరులున్నారు.

రైతులకు ఆధార్ లింక్‌తోనే ఎరువులు విక్రయించాలి


హవేళిఘణపూర్‌లో ఫర్టిలైజర్ షాప్ ను తనిఖీ చేస్తున్న డీఏవో

హవేళిఘణపూర్, జూలై 31: రైతులకు ఆధార్ కార్డుతోనే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి గోవిందు తెలిపారు. బుధవారం మండలంలోని ఫరీద్‌పూర్, హవేళిఘణపూర్, తొగిట, నాగాపూర్, సర్దన, గ్రామాల్లోని షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీలో ఏమైనా సందేహాలుంటే గ్రీవెన్స్‌లో వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేయాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి నాగమాధురి ఉన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు


జిన్నారం: మాదక ద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకిస్తూ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

జిన్నారం, జూలై 31: మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకంపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ పుష్పన్‌కుమార్ అవగాహన కల్పించారు. గంజాయి సాగు రవాణా చేపట్టే వారిపై హిస్టరీ షీట్లను ఓపెన్ చేశామని, మాదక ద్రవ్యాల వినియోగం చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల సమాచారం అందితే 8712656777 నెంబరుకు సమాచారం ఇవ్వాలని, విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా రూపొందిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐ సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

● మెదక్ కల్చరల్: మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ మాచవరంలో కళాబృందంవారు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ మెదక్‌రూరల్ ఏఎస్ఐ శివకుమార్, మెదక్ జిల్లా కళాబృందం, సిబ్బందితో కలిసి నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, షీ టీమ్స్ గంజాయి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళా బృందం, సిబ్బంది మరియు స్కూల్ యాజమాన్యం 320 మంది విద్యార్థులు హాజరయ్యారు.

● వెల్దుర్తి: మండల పరిధిలోని కుకునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీసులు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ లాయక్ అలీ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

చిన్నశంకరంపేట, జూలై 31: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కృష్ణమూర్తి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఖాజాపూర్ గ్రామ శివారులో బుధవారం కావేరి స్టీల్ పరిశ్రమలో పరిశ్రమ ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పరిశ్రమ మేనేజర్ పరమేశ్వర్, పరిశ్రమ సిబ్బంది సంతోష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్‌గా శ్రీదేవి

మాసాయిపేట, జూలై 31: మండల ఆయుర్వేదిక ఆసుపత్రి మెడికల్ అధికారిగా పాకాల శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు మాసాయిపేట ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో ఇన్నాళ్లు పనిచేసిన ఫార్మాసిస్ట్ కవిత బదిలీపై హైదరాబాదుకు వెళ్లగా మాసాయిపేటకు వరంగల్ జిల్లా నుంచి మెడికల్ అధికారిగా శ్రీదేవి బదిలీపై వచ్చారు అలాగే ఆసుపత్రికి ఇబ్రహీంపూర్ నుంచి ముంతాజ్ అలీ ఆఫీసు సబ్బార్డినేటుగా విధుల్లో చేరారు.

ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

చిన్నశంకరంపేట, జూలై 31: ధరణి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి రెవెన్యూ సిబ్బందికి సూచించారు. బుధవారం చిన్నశంకరంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో సందర్శించి రెవెన్యూ సిబ్బందికి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ ప్రక్రియ నమోదును పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఆలాగే సీజన్ వ్యాధులు ప్రబలడంతో రెవెన్యూ సిబ్బంది ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వన మహోత్సవ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని సిబ్బందితో కలిసి పలు రకాల మొక్కలను నాటారు.కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, డిప్యూటీ తహసీల్ధార్ మహేందర్‌గౌడ్, ఆర్ఐ గోవింద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సూరారంలో రెండోరోజు మెడికల్ క్యాంపు

చిన్నశంకరంపేట, జూలై 31: మండలంలోని సూరారం గ్రామంలో రెండో రోజు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు కొనసాగింది. బుధవారం మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఎంపీవో కలిమొళ్ల, పంచాయతీ కార్యదర్శి నామ్‌పల్లి, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న పాత సామగ్రి, టైర్లు తొలగించారు. మురికి కాలువలు, పరిసరాల్లో హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. 100 మందికి పైగా వైద్య సేవలందించి మాత్రలు పంపిణీ చేసినట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న వ్యక్తులకు మెరుగైన వైద్యం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తకణాలు తగ్గినవారికి మెదక్ ఆసుపత్రికి తరలించినట్లు ఆమె తెలిపారు.

ఆరింట్లో ఐదు హామీలు నెరవేర్చాం: రోహిత్‌రావు


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

పాపన్నపేట, జూలై 31: కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన 8 నెలల్లో ఐదు హామీలు నెరవేర్చామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రకటించారు. బుధవారం పాపన్నపేట మండలం నార్సింగ్‌లో 134 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఏడుపాయల్లో కల్యాణకట్ట, పాకశాల ప్రారంభం, రూ.80 లక్షల వ్యయం అంచనాతో డోమ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏడుపాయలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవిందనాయక్, ఆలయ చైర్మన్ బాలాగౌడ్, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మల్లప్ప, కాంగ్రెస్ అధికార ప్రతినిధి శెట్టి శ్రీకాంత్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇండస్ మెడికేర్ పరిశ్రమ ఎన్నికల్లో సీఐటీయూ జయకేతనం

మనోహరాబాద్, జూలై 31 : మనోహరాబాద్ మండలం రామయపల్లిలోని ఇండస్ మెడికేర్ పరిశ్రమలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ జయకేతనం ఎగరవేసింది. పరిశ్రమలో 46 మంది కార్మికుల ఓట్లు ఉన్నాయి. అందులో సీఐటీయూ తరపున నిలబడిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరిశ్రమ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌కు 25 ఓట్లు, ఐఎన్‌టీయూసీ తరపున నిలబడిన ప్రత్యర్థికి 21 ఓట్లు రావడంతో, సుమారు 4 ఓట్ల తేడాతో మల్లిఖార్జున్ గెలుపొందారు.

చేసిన సేవలతోనే గుర్తింపు


సన్మాన కార్యక్రమంలో ఆర్డీవో రాజు, నిమ్జ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి

జహీరాబాద్/ఝరాసంగం జూలై 31: ప్రభుత్వ రంగసంస్థల్లో వృత్తిరీత్యా బదిలీలు, పదోన్నతులు సహజమేనని, ఉద్యోగులు విధినిర్వహణలో చేసిన సేవలే గుర్తింపును తెచ్చిపెడతాయని జహీరాబాద్ ఆర్డీవో రాజు, నిమ్జ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఝరాసంగం తహసీల్దార్ సంజీవరావు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా సన్మాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగ విరమణ పొందిన ఝరాసంగం తహసీల్దార్ సంజీవరావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఝరాసంగం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు హన్మంతరావుపాటిల్, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు దేవీదాస్, డిప్యూటీ తహసీల్దార్ యాజీన్, ఆర్ఐ రామారావు, నాయకులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

కల్హేర్, జూలై 31: కార్యాలయానికి సమయానికి విధులకు హాజరు కావాలని, లేదా చర్యలు తప్పవని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్ బుధవారం సిబ్బందిని హెచ్చరించారు. ఎంతో కాలంగా కల్హేర్ తహసీల్ కార్యాలయంలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. అయితే నూతనంగా తహసీల్దార్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ నిత్యం సమయానికే కార్యాలయానికి వస్తున్నారు. మిగతా సిబ్బంది బుధవారం ఆలస్యంగా విధులకు హాజరు కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజర్ అయి బుధవారం కార్యాలయానికి ఆలస్యంగా వచ్చిన జూనియర్ అసిస్టెంట్ కార్తీక్‌కు మెమో జారీ చేయాలని ఆర్ఐ మల్లేశంను తహసీల్దార్ ఆదేశించారు.

15నెలలుగా వేతనాలు అందక ఇక్కట్లు

నారాయణఖేడ్,జూలై31: క్షేత్రస్థాయిలో మూగజీవాలకు వైద్యం అందిస్తూ పాడిరైతుల సంక్షేమానికి పాటుపడుతున్న తమకు 15 నెలలుగా వేతనాలు అందడం లేదని ఖేడ్‌కు చెందిన 1962 జీవీకేసంస్థ అంబులెన్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న పశువైద్యాధికారిణి డాక్టర్ రహియ, పారా వెటర్నర్ అంబయ్య, పైలెట్‌ప్రవీన్, సహాయకుడు నరేష్ ఆవేదనవ్యక్తంచేశారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం గత 15 నెలలుగా తమ సంస్థకు నిధులుచెల్లించక పోవడంతో సంస్థ తమకు వేతనాలుచెల్లించడం లేదని వాపోయారు.

సమాజంలో ప్రతి ఒక్కరికీ హక్కులుంటాయి

- పలు మండలాల్లో పౌరహక్కుల దినోత్సవం


మనూరు మండలం తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న ఆర్డీవో అశోక చక్రవర్తి


వెల్దుర్తిలో మాట్లాడుతున్న తహసీల్దార్ తులసీరామ్

నారాయణఖేడ్,జూలై 31: కుల వివక్షత, అంటరాని తనం పాటించడం నేరమని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి అన్నారు. బుధవారం మనూరు మండలం తిమ్మాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరికి సమానత్వపుహక్కులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, మనూరు తహసీల్దార్ వెంకటస్వామి, ఎస్ఐ రాజశేఖర్, ఆర్ఐలు శంకర్‌రెడ్డి, రాంచందర్, జూనియర్‌అసిస్టెంట్ ఖాజామైనోద్దీన్, గ్రామస్తులుపాల్గొన్నారు.

● కంది: మండలపరిధిలోని ఇంద్రకరణ్, ఎర్దనూర్ గ్రామాల్లో బుధవారం కంది నాయబ్ తహసీల్దార్ సల్ల మల్లయ్య పోలీసు సిబ్బందితో కలిసి పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పౌరుడు తన హక్కులను వియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలు పంచాయతీ కార్యదర్శులు, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

● పటాన్‌చెరు: పౌరహక్కుల పరిరక్షణ ప్రతీ ఒక్కరి సామాజిక బాధ్యత అని అమీన్‌పూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వడక్‌పల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన పౌర హక్కుల అవగాహన సదస్సులో ఏఎస్ఐ మన్సూర్‌అలీఖాన్, పంచాయతీ కార్యదర్శి అనుపమతో కలిసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

● గుమ్మడిదల: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్ కుమార్ గ్రామస్థులకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు.

● జహీరాబాద్: ప్రజలకు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన అత్యవసరమని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రుక్మొద్దీన్, బాలుర వసతిగృహం అధికారి క్రిష్ణ వంశీపేర్కొన్నారు. మండలంలోని అల్గోల్ గ్రామంలో బుధవారం ప్రజలకు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహనను కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సాజీద్, మాజీ సర్పంచ్ జ్యోతిమోహన్, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మమత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● నిజాంపేట: రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ గంగాధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించి ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రేమ గ్రామస్థులు పాల్గొన్నారు.

● నర్సాపూర్: ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉన్నపుడే న్యాయం పొందే అవకాశముంటుందని ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. బుధవారం మండలంలోని కాగజ్‌మద్దూర్‌లో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఎస్ఐ పాల్గొని మాట్లాడుతూ పౌరహక్కులతో పాటు చట్టాలపై అవగాహన ఉండాలన్న ఉద్దేశంతో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని తహసీల్దార్ తులసీరామ్ అన్నారు. బుధవారం వెల్దుర్తిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అందరూ సమానమేనని, కులం, మతం అంటూ అసమానతలు పాటిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో వెల్దుర్తి ఈవో బలరాంరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ లాయక్‌అలీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.